క్లుప్తంగా

వైస్ ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

ఇల్లెందురూరల్: ఇల్లెందు వైస్ ఎంపీపీ ఎన్నిక కోసం ఎన్నికల అధికారి రామకృష్ణ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 24న మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహిస్తున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. కోరం పూర్తయిన అనంతరం హాజరైన ఎంపీటీసీలతో ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన



పరిశీలిస్తున్న అశోక్ కుమార్

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను సోమవారం సెక్టార్ ఆఫీసర్, చుంచుపల్లి ఎంపీడీఓ వి.అశోక్ కుమార్ ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు. ఈనెల 27న వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో 281, 282 పోలింగ్ కేంద్రాల్లోని సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రూట్ ఆఫీసర్ ఎం.తిరుపతిరావు సిబ్బంది పాల్గొన్నారు.

నర్సయ్య సేవలు మరువలేనివి



నర్సయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మద్దెల శివకుమార్, సాబీర్‌పాషా

కొత్తగూడెంరూరల్: కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ఎన్నో పోరాటాలు చేసిన బండెల నర్సయ్య సేవలు మరువలేనివని అంబేడ్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. రుంద్రపూర్‌లో బండెల నర్సయ్య సంతాప సభ సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగామాట్లాడుతూ.. నర్సయ్య నిత్యం కార్మికుల సమస్యలు పర్కించేందుకు ఎన్నో పోరాటాలు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి సీతారామయ్య, కొమిరి రాజకుమార్, ఎస్‌కే సాబీర్‌పాషా, సింగరేణి రిటైర్డ్ జీఎం పర్సనల్ ఆనందరావు, కాంగ్రెస్ నాయకులు నాగసీతారాములు, కోనేరు సత్యనారాయణ, అంతోటిపాల్, పూల రవీందర్ తదితరులు ఉన్నారు.

2,031 ఎమ్మెల్సీ ఓట్లు

టేకులపల్లి: ఈనెల 27న వరంగల్ – నల్గొండ – ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నిక జరగనుంది. టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 251, 252 నంబర్లతో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. 251 పోలింగ్ బూత్‌లో పురుషులు 647, మహిళలు 412 మొత్తం 1059 మంది, 252 పోలింగ్ పోలింగ్ బూత్‌లో పురుషులు 602, మహిళలు 370 మొత్తం 972 మంది రెండు కేంద్రాల్లో కలిపి పురుషులు 1,249, మహిళలు 782 మొత్తం 2031 మంది పట్టభద్రులు తమ ఓటుని వినియోగించుకోనున్నారు. పట్టభద్ర ఓటర్లలో మహిళలకంటే పురుషులే అధికంగా ఉండటం విశేషం. గతంలో ఇదే ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఒకటే పోలింగ్ బూత్ ఉండేది. అప్పుడు పురుషులు 1,293, మహిళలు 635 మొత్తం 1,928 మంది ఓటర్లు ఉండగా ఈసారి 103 మంది ఓటర్లు పెరిగారు.

'ప్రభుత్వ' విద్యార్థిని ప్రతిభ



హిమబిందు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థినికి తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో సీటు దక్కిందని పాఠశాల హెచ్‌ఎం ప్రభుదయాళ్ సోమవారం తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో పాఠశాల 96 శాతం ఫలితాలు సాధించడం జరిగిందని, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కెరీర్ గైడెన్స్ ఇవ్వడం వలన హిమబిందు తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో సీట్ సాధించిందని వివరించారు. హిమబిందు సీటు సాధించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

పాల్వంచరూరల్: డబ్బుల విషయంలో అన్నదమ్ముల మధ్య తలెత్తిన వివాదం ఆదివారం ఘర్షణకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. నాగారం ఎస్సీ కాలనీలో అన్నదమ్ములైన పెద్దిరాజు, దుర్గాప్రసాద్‌ల మధ్య వివాదం చోటుచేసుకుంది. తనపై కర్రతో దాడి చేశాడని తమ్ముడు దుర్గాప్రసాద్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పెద్దిరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

పంచాయతీల ఖజానా ఖాళీ

ఇల్లెందు మండలంలోని ఓ మారు మూల గ్రామపంచాయతీ ఖాజానాలో ప్రస్తుతం కేవలం రూ.30వేల నిధులు మాత్రమే ఉన్నాయి. నిధుల కొరత కారణంగా మల్టీపర్పస్ వర్కర్లకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. పంచాయతీ నిర్వహణ కోసం గడిచిన మూడు నెలలుగా రూ.70వేల వరకు అప్పు చేయాల్సి వచ్చింది. ఇక పాత బకాయిలు సరేసరి.. ఇది ఆ ఒక్క పంచాయతీ సమస్య కాదు.. మండలంలోని అత్యధిక గ్రామపంచాయతీలు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాయి.



ఒడ్డుగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం

- భారంగా మారిన నిర్వహణ
- ఇప్పటికే అప్పుల ఊబిలో కార్యదర్శులు
- కొన్ని పంచాయతీల్లో కార్మికులకు అందని వేతనాలు..
- వచ్చే నెల నిర్వహణ, వేతనాలూ అనుమానమే

ఇల్లెందురూరల్: చిన్న గ్రామపంచాయతీలు ఏర్పడిన తరువాత నిర్వహణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీనెల నిధులు మంజూరు చేసేవి. ఆయా నిధుల సహాయంతో ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు పంచాయతీలలో పనులు చక్కగా చేయించి అందరి మన్నలు పొందేవారు. సర్పంచ్‌ల పాలనా కాలంలోనే రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధుల మంజూరు లేకపోవడం, పార్లమెంట్ ఎన్నికల ప్రకటన నాటి నుంచి కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే 15వ ఆర్థిక సంఘం నిధుల మంజూరు నిలిచిపోయింది. మార్చి నాటికి వసూలు చేసిన ఇంటి పన్నులను జనరల్ ఫండ్ ఖాతాలో జమ చేసిన కార్యదర్శులు ఏ అవసరం వచ్చినా ఆ ఖాతాలో నిధులను వినియోగించుకుంటూ కొంతకాలం కాలం వెళ్లదీశారు.

పేరుకుపోతున్న అప్పులు..

గ్రామపంచాయతీలలో అరకొరగా ఉన్న నిధుల నిల్వలను విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐల చెల్లింపుకు వినియోగిస్తున్నారు. ఇతర ఏ అవసరం ఉన్నా అప్పులు చేయక తప్పని పరిస్థితి. ఇంతే కాకుండా గ్రామపంచాయతీలలో గతంలో పనిచేసిన సర్పంచ్‌లు తమ పదవీ కాలంలో చేసిన పనులకు నిధుల చెల్లింపు నేటికీ బకాయిగానే ఉండిపోయింది. ప్రతీరోజు పారిశుద్ధ్య పనులలో భాగంగా ఇంటింటా చెత్త సేకరణ కోసం వినియోగించే ట్రాక్టర్ డీజిల్ కొనుగోలు కార్యదర్శులకు సమస్యగా మారింది. వీటికి తోడు వేసవిలో నీటిఎద్దడి నివారణ పేరుతో పైపులైన్లకు, చేతిపంపులకు మరమ్మతులు, ఉపాధి హామీ కూలీలకు తాగునీరు, నీడ సౌకర్యం, నర్సరీలకు షేడ్‌నెట్, ఎరువులు, నీటి సౌకర్యం వంటివన్నీ అప్పులు చేసి సమకూర్చుకున్నవే. వర్షాలు సమీపిస్తున్నందున బ్లీచింగ్ పౌడర్ సిద్ధం చేయాలని, మురుగుకాల్వలు శుభ్రం చేయించాలని, నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి మట్టితో పూడ్చివేయాలన్న ఆదేశాలు కార్యదర్శులను కంటికి కనుకులేకుండా చేస్తున్నాయి.

నామమాత్రంగానే ప్రత్యేక అధికారులు...

సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో పంచాయతీలలో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. కానీ వారి పాలన నేడు నామమాత్రంగానే కనిపిస్తోంది. ఫైళ్లపై సంతకాలు చేయడానికి మినహా పంచాయతీల నిర్వహణ, అభివృద్ధిలో వారి భాగస్వామ్యం శూన్యమేనని చెప్పాలి. ప్రస్తుతం పంచాయతీలలో నిధుల లేమి సమస్యగా మారడం, కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని స్థితి నెలకొనడంపై ప్రత్యేకాధికారులు దృష్టిసారించడం అటుంచితే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం కూడా చేయకపోవడం విచారకరం.

వచ్చేది వర్షాకాలం...

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. ఈ సమయంలో పారిశుద్ధ్య పనులు అటకెక్కితే రానున్న రోజుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం లేకపోలేదు. అన్నీ సక్రమంగా సాగిన సమయంలోనే దోమల బెడదతో ప్రజలు జ్వరాల బారిన పడి తీవ్రంగా ఇబ్బంది పడేవారు. అటువంటిది పారిశుధ్య పనులు చేయకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో వేరే చెప్పనవసరం లేదు.

పాలనపై తీవ్ర ప్రభావం...

కాసింత పెద్ద పంచాయతీలకు ఆదాయం కొంత ఫర్వాలేదన్న స్థాయిలో సమకూరుతోంది. గతంలో మంజూరైన నిధులను పాతబకాయిలకు చెల్లించకుండా అలాగే నిల్వ ఉంచుకున్న గ్రామపంచాయతీలను మినహాయిస్తే చిన్న గ్రామపంచాయతీలతోపాటు మరికొన్ని పెద్ద గ్రామపంచాయతీలలో నేడు నిధుల లేమి ప్రధాన సమస్యగా మారింది. వచ్చేనెల అత్యధిక గ్రామపంచాయతీలలో వేతనాలు, ఇతరత్రా ఖర్చులు అటుంచితే కనీస నిర్వహణ కూడా మరీ భారంగా మారే పరిస్థితి నెలకొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తక్షణం నిధులు విడుదల చేయని పక్షంలో పంచాయతీలు పడకేసే ప్రమాదం ఉంది.

నిధుల కొరత సమస్యగా ఉంది



గ్రామపంచాయతీలకు నిధులు మంజూరు లేకపోవడంతో నిర్వహణ భారంగా మారింది. చాలామంది కార్యదర్శులు పంచాయతీ నిర్వహణ విషయంలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కొన్ని పంచాయతీలలో కార్మికుల వేతనాల చెల్లింపులు కూడా నిలిచిపోయాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– చిరంజీవి, మండల పంచాయతీ అధికారి, ఇల్లెందు

నేడు ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం

కొత్తగూడెంరూరల్: ఎమ్మెల్సీ ఎన్నికలపై కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం మధ్యాహ్నం నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య తదితరులు హాజరు కానున్నారు. నియోజకవర్గంలోని సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, టీజేఎస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు, గ్రాడ్యుయేట్ ఓటర్లు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఎన్నికల సమన్వయకర్త తుళ్లూరి బ్రహ్మయ్య సోమవారం తెలిపారు.

ఇరిగేషన్ అధికారి మృతి

పాల్వంచ: ఇరిగేషన్ సూపరింటెండెంట్ సంధ్రు క్రాంతి (42) సోమవారం మృతి చెందింది. బాపూజీనగర్‌కు చెందిన క్రాంతి అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఆదివారం కుమారుడు రఘురామ్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పైపులైన్ నిర్మాణ పనులు అడ్డగింత

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామ పంచాయతీలో కిన్నెరసాని పైపులైన్ నిర్మాణ పనులను స్థానికులు సోమవారం అడ్డుకున్నారు. మాకు ఇంటింటికీ కిన్నెరసాని పైపులైన్ కనెక్షన్లు ఇవ్వాలని సంబంధిత కాంట్రాక్టరుతో వాగ్వాదానికి దిగారు. గ్రామంలో తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామని, ప్రతీరోజూ పనులకు వెళ్లి ఇంటికి వస్తే.. తాగునీరు లేక బిందె తీసుకుని ఊళ్లోకి వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. స్పందించిన కాంట్రాక్టర్ ఈ విషయం సంబంధిత అధికారులతో గ్రామస్తులంతా కలిసి మాట్లాడుకోవాలని, నేను చేసేది ఏమీ ఉండదని చెప్పటంతో వారు శాంతిచారు. అనంతరంపైపులైన్ నిర్మాణ పనులు యాథావిధిగా కొనసాగాయి.



పనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

స్కిల్డ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న నజీర్ అహ్మద్

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో ఎల్ఎస్ఎన్ కంపెనీ వద్ద పని చేస్తున్న బ్లాస్టింగ్ కార్మికులకు స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం కేటీసీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్ఎస్ఎన్ యాజమాన్యం చెల్లిస్తున్న అన్ స్కిల్డ్ వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోల్ ఇండియా కార్మికులకు రోజుకి ఒక్కో కార్మికుడికి రూ.1199 నెలకు రూ.31.174 చెల్లిస్తుందని, అదే విధంగా సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న బ్లాస్టింగ్ కార్మికులకు కూడా కోల్ ఇండియా తరహా వేతనాలు చెల్లించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతీ కార్మికుడికి బ్లాస్టింగ్ కోడ్ ప్రకారం రెండు జతల ఎరుపు రంగు దుస్తులు ఇవ్వాలన్నారు. టేకులపల్లి సీపీఐ మండల కార్యదర్శి జి.రాంచందర్ నాయక్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉండి కాంట్రాక్టు కార్మికుల సంక్షేమం గాలికి వదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఓ నంబర్ 22 అమలు చేయకుండా కాంట్రాక్టర్లకు లొంగిపోయి కార్మికవర్గానికీ తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేస్తామని జీఓ నంబర్ 22ను అమలు చేస్తామని హామీ ఇచ్చారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియా తరహా వేతనాలు చెల్లించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అయిత శ్రీరాములు, శ్రీను, మంగీలాల్, ఆదినారాయణ, వస్రాం, సేట్యా, భద్రు, సత్యనారాయణ, మనోహర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా తూము నిర్మాణం

సుజాతనగర్: సింగభూపాలెం కుడి కాల్వ వద్ద నిర్మించిన తూము ప్రమాదకరంగా మారింది. ఈ తూము ద్వారానే చెరువులో నీటి నిల్వలు ఎన్ని అడుగుల ఉన్నాయో తెలుసుకునే అవకాశం ఉండగా.. భూమికి సమాంతరంగా ఈ తూము నిర్మాణం చేపట్టడంతో ఇది ప్రమాదకరంగా మారింది. సాయంత్రం వేళల్లో ఆహ్లాదాన్ని పొందేందుకు పలువురు స్థానికులు, రైతులు ఇక్కడికి వస్తుంటారు. మెట్లు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జారి తూములో పడిపోయే అవకాశం ఉంది. పంచాయతీ అధికులు స్పందించి చుట్టూ ప్రహరీ నిర్మాణం చేసి ప్రమాదం జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న తూము

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఇల్లెందు: సింగరేణి సోలార్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. సోమవారం ఇల్లెందులోని సోలార్ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు, జిల్లా నాయకులు ఎస్ఏ నబీ మాట్లాడుతూ... కార్మికులకు మోసపూరిత వేతనాలు ఇచ్చి డ్యూటీ టైమింగ్స్ పాటించకపోవటం దుర్మార్గమన్నారు. రక్షణ విషయంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పేస్లిప్పులు, ఐడీ కార్డులు, అపాయింట్‌మెంట్ ఆర్డర్లు, యూనిఫాం, సేఫ్టీ సామగ్రి అందించాలని సోలార్ ఇన్‌చార్జ్ సాయిని డిమాండ్ చేశారు. అనంతరం ఏరియా జీఎం జాన్ ఆనంద్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో భీంసింగ్, కృష్ణ, రాజ్‌కుమార్, శంకర్, హరికిషన్, శ్యామ్‌బాబు, వీరేందర్, కిరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధు

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం



జీఎం జాన్‌ఆనంద్‌తో క్రీడాకారులు



పుస్తకాలు అందజేస్తున్న జీఎం

ఇల్లెందు: ఇల్లెందు సింగరేణి 24 ఏరియా రన్స్ అండ్ గోల్స్ స్టేడియం, జేకే స్కూల్ గ్రౌండ్‌లో సింగరేణి కార్మికుల పిల్లలకు వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి క్రీడా శిబిరం ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ శిబిరంలో ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ మాట్లాడుతూ..

చిన్ననాటి నుంచి ఆటల మీద ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆటల మీద శ్రద్ధ చూపిన ఎంతోమంది తమ ప్రతిభను ప్రదర్శించుకుని ఉన్నత శిఖరాలకు ఎదిగారని తెలిపారు. ఆటలలో ప్రతిభను కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు మల్లారపు మల్లయ్య, జీవీ మోహన్‌రావు, రవికుమార్, సాయి స్వరూప్, గుర్తింపు సంఘం ప్రతినిధి కిషోర్, ప్రాతినిధ్య సంఘం నుంచి యాదగిరి, బాలాజీ, సాంబయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత..

సింగరేణి సేవా సమితి నిర్వహిస్తున్న గ్రంథాలయానికి నూతన పుస్తకాలను ఏరియా జీఎం జాన్ ఆనంద్ పంపిణీ చేశారు. సోమవారం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ నిరుద్యోగులకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ కూడలిలో ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. కొత్తగూడెం నుంచి ఇల్లెందుకు వచ్చే మార్గంలో కూడలి వద్ద రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. బీటీ చాలా వరకు తొలగిపోవడంతోపాటు రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో రాత్రివేళలో ఆదమరిచి ఈ మూలమలుపు వద్ద ఏ మాత్రం వేగంగా వచ్చినా ప్రమాదం కొనితెచ్చుకున్నట్లే. ఇప్పటికే పలు ప్రమాదాలు చోటుచుసుకున్నా గ్రామపంచాయతీ అధికారులు.. ఆర్అండ్‌బీ అధికారులు.. నిర్లక్ష్యాన్ని మాత్రం వీడటం లేదు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణం మరమ్మతులు చేయించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.



బీటీ తొలగిపోయి రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి

బీటీ రోడ్డు పనులకు మోక్షమెప్పుడో?

- ఇద్దరు ఎమ్మెల్యేల శంకుస్థాపన
- అయినా ప్రారంభం కాని పనులు
- నల్లబండబోడు ప్రజలకు తప్పని ఇబ్బందులు



సీతారామ కాల్వ దాటడానికి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి కట్ట

జూలూరుపాడు: నల్లబండబోడు బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. గత ఎనిమిది నెలల కాలంలో ఇద్దరు ఎమ్మెల్యేలు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు కానీ పనుల ప్రారంభానికి మోక్షం కలగడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 2023లో బీటీ రోడ్డు మంజూరయింది. నెల రోజుల్లో ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని హడావుడిగా ఎనిమిది నెలల క్రితం ఆనాటి వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కానీ పనులు ప్రారంభించలేదు. ఎన్నికలయ్యాయి. ఎమ్మెల్యే మారిండు, ప్రభుత్వమూ మారింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత తాజా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఎంపీ ఎన్నికల కోడ్‌కు ముందు రోజు మార్చి 14, 2024న అదే బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మళ్లీ తిరిగి శంకుస్థాపన చేశారు. కానీ నేటికీ ప్రారంభం పనులు కాలేదు. బీటీ రోడ్డు మంజూరు కావడంతో ఎంతో సంతోషడిన నల్లబండబోడు గ్రామ ప్రజలకు నిరాశే మిగిలింది. మండల కేంద్రం జూలూరుపాడుకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో ఉన్న మారుమూల గ్రామమే నల్లబండబోడు. అనంతారం నుంచి నల్లబండబోడు వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల బీటీ రోడ్డు లేకపోవడంతో గిరిజన ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామంలో కుటుంబాల మొత్తం కుటుంబాలు 51 కాగా, 43 ఆదివాసీ గిరిజన కుటుంబాలు కాగా, మిగిలిన ఎనిమిది కుటుంబాలు గిరిజనేతరులు. రోడ్డు సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, పిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తిన సమయంలో గ్రామం నుంచి మండల కేంద్రంలోని ఆస్పత్రికి చేరుకోవాలంటే ఎనిమిది కిలోమీటర్లు దూరంగా ఉండగా, ఇందులో నల్లబండబోడు నుంచి అనంతారం వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రాళ్లు తేలిన రోడ్డు, ముళ్ల పొదలు, చెట్లతో మూసుకపోవడంతో గిరిజనులు నరకయాతన పడుతున్నారు. పదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల నిధులతో మెటల్ రోడ్డు నిర్మించారు. మెటల్ రోడ్ అస్తవ్యస్తంగా తయారై రాళ్లు తేలడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైంది. ప్రాణపాయ స్థితిలో ఉన్నవారి పరిస్థితి ఇక చెప్పాల్సిన పనిలేదు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో అనంతారం నుంచి నల్లబండబోడు వరకు బీటీ (తారు) రోడ్డు నిర్మిస్తేనే ఓటు వేస్తామని భీష్మించారు. అయితే అధికారులు బీటీ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇవ్వడంతో ఓటు హక్కు వినియోగించుకున్నారు. నల్లబండబోడు గ్రామ జనాభా 500 మంది కంటే తక్కువగా ఉండటం వల్ల బీటీ రోడ్డు మంజూరు కావడం లేదని ఇన్నేళ్లు అధికారులు సాకులు చెబుతూ వచ్చారు. ఎట్టకేలకు బీటీ రోడ్డు మంజూరైనా పనులకు మోక్షం కలగకపోవడంతో గిరిజనులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు బీటీ రోడ్డు పనులు ప్రారంభించకపోగా గ్రామ సమీపంలో నిర్మించిన సీతారామ కెనాల్‌పై నిర్మించతలపెట్టిన బ్రిడ్జి పనులు ఆరేళ్లుగా నత్తనడకనే సాగుతున్నాయి. ఊళ్లోకి వెళ్లాలంటే సీతారామ కెనాల్ దాటాల్సి ఉంటుంది. తాత్కలికంగా ఏర్పాటు చేసిన మట్టి కట్టపై నుంచి రాకపోకలు సాగించాల్సి రావడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని దాటాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలంలో మట్టికట్ట కోతకు గురికావడంతో కాల్వ దాటడం ప్రమాదకరంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డంతా రాళ్లు తేలి, ఇరువైపుల ముళ్ల పొదలు, చెట్లు కమ్ముకొని పోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నా అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయ నాయకులకు తాము గుర్తొస్తామని, ఆ తరువాత పట్టించుకునేవారు ఉండరని వాపోతున్నారు. ఈ విషయంపై ఐటీడీఏ ఏఈ ఐవీఎస్ ప్రసాద్‌ను వివరణ కోరగా.. టెండర్ ప్రకియ పూర్తయ్యేనాటికి ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అగ్రిమెంట్ కాలేదన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.



కెనాల్‌పై నిర్మిస్తున్న బ్రిడ్జి



నల్లబండబోడు గ్రామం

రోడ్డు పనులు ప్రారంభించాలి..



బీటీ రోడ్డు నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించాలి. శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా అతీగతీ లేదు. ఎన్నికల కోడ్ వస్తుందని హడావుడిగా శంకుస్థాపన చేసి వదిలిపెట్టారు. ఎన్నికల సమయంలో నాయకులు ఓట్ల కోసం వస్తారు గానీ, తరువాత పట్టించుకోరు.

– మందరెకల లక్ష్మయ్య

రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది..



నల్లబండబోడు నుంచి అనంతారం వరకు రోడ్డంతా అస్తవ్యస్తంగా ఉంది. జూలూరుపాడు వెళ్లాలంటే రోడ్డు సక్రమంగా లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. రాత్రివేళల్లో మరింత ఇబ్బందిగా ఉంటుంది. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పనులు చేపట్టాలి.

– బచ్చల శ్రీను

ఇబ్బంది పడుతున్నాం...



అనంతారం నుంచి నల్లబండబోడు వరకు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. రోడ్డు మంజూరు కావడంతో సంతోషించాం కానీ, పనులు మొదలే కాలేదు. దీంతోపాటు సీతారామ కాలువపై బ్రిడ్జి పనులు కూడా కాలేదు. ప్రమాదం పొంచి ఉంది.

– బచ్చల పున్నమ్మ